ఓయి సూర్యుఁడ ! యుదయించె దోయి ! యకట !
ప్రాణములు పోవునట యుదయాస్తమయము
లందు నీ యొక్కయును నల్ల చందమామ
యొక్కయును, ప్రాణులకు నెల్ల సర్వియందు.

(మోహము)

[ద్రౌపది ప్రవేశము]

ఇదియుఁ దగినకార్యమె సమర్థించుచుంటి
సకలభూపాలమకుటరాజచ్చరణుఁడ
ఆ యుధిష్ఠిరనృపతి కర్ధాంగి నగుదు
నల్లతూరుపుసతికూడఁ దెల్లవోవు.

ఇదియె కీచకుని యిల్లు. సర్వథా యిదియే కావలయును. ఆ స్త్రీ చెప్పిన గుర్తు లన్నియు నిందే కనంబడు చున్నవి. పులి దాగియున్నగుహాలో మూలికకై పోవు బైరాగివలె నున్నాను. ఏవిధమైన యాలస్యము కూడదు. అదిగో ! ఆ కూర్చున్నది యాతఁడే. ఇతనితో నేమని మాటలాడుదును?

కీచ:-(చూచి) ఓహో! శృంగారరసపట్టభద్ర! వచ్చితివా?

రాఁగదవె బాల! నా యూరుభాగమందు
నీకు పూర్వమ్మె స్థిరపడెనే పదమ్ము
ఇదివరకు నిన్ను వెదుకని యీ కుటిలుని
జన్మ నిష్ఫల మగుటె శిక్షాపథంబు.

నీ యీ యభిసారికావేషమున నా హృదయఫలకము చిత్రకారుని పటమువలె నయినది. నీ యీ మనోహరమూర్తి నేమని వర్ణింతును?

మోహినీ! వానలోఁ దడిముద్ద వయితి
నీ శిరమ్మున ముసుఁగైన నీలవసన
మతివ ! సౌదామినీవల్లి నావరించు
చిఱుమొగిలురీతి నందమ్ము చిందుచుండె.

ఆకసమున నా సౌందర్యము. ధారుణీతలమున నీ సౌందర్యము.

వనితా! దంపతు లెల్ల నీ గతనిశాభాగంబు గాటంపు ప్రే
మను బంధింతు రొకళ్ళొకళ్ళ నవశంపామేఘముల్ వోలె నా
కను లీ ప్రోవను జూచిచూచి ఫలముల్ గాంచెన్ బరిష్వంగసం
జనితానందరసైకమగ్నుని నొనర్పన్ జూడవే యిప్పుడేన్

ద్రౌ:—అయ్యా! మీయక్క సుదేష్ణాదేవి శిరోభారమున వందురుచున్నది. మీయొద్ద దివ్యమైన మదిర దొరకునఁట. నన్నుఁ దీసికొనిరమ్మని పంపినది. దయచేసి యిప్పింపుఁడు. ఆమె నాకొఱ కెదురు చూచుచుండును.

కీచ:—మదిర నీవు తీసికొని పోవలయునా? ఏపరిచారికచేతనైనఁ బంపించెదను. మూఁడులోకములకుఁ బట్టపురాణివి కాదగిన నీవట్టి పనులేల జేయుదువు?

ఆశాబంధ మొకటి నన్ను వెనుకకు లాగుచున్నది. లేకున్న నే నీపాటి కెక్కడ నుండవలసినదో! ప్రియా! దయఁ జూడుము. నే నేమి యపరాధము చేసితిని. నిన్ను వీడి యిఁక తెప్పపాటుకాలమైన నిలువఁజాలను. నన్నింత పేదపఱచిన నీ సౌందర్యము భూతధాత్రి కెల్ల నలంకార మగుచున్నది. నీ విచ్చటకు వచ్చినదే నాపైఁ గల మచ్చికకుఁ దార్కాణ.

ద్రౌ:—అయ్యా! నిజముగా నేను మదిరకై వచ్చితిని. సుదేష్ణాదేవి శిరోవేదనవలన మిక్కిలి బాధపడుచున్నది. మదిరఁ దీసికొని పోయి యామె కీయవలయును. శీఘ్రముగ నన్నుఁ బంపుడు.

కీచ:—ఎవరక్కడ.

సేవకుఁడు:—(ప్రవేశించి) చిత్తము.

రమణి పిఱుదులు బండిచక్రముల వోలెఁ
దిరుగుచున్నవి కామిని పరుగునపుడు
ఆ సుదతి దేహవల్లికా యూహాప్రపంచ
మందు మెఱుపు విధాన రమ్యతఁ దనర్చు

ఈమె యిప్పుడు తుపానుగాలులకుఁ గదలిపోవుచున్న యోడవలె నెంతసొగసుగా నున్నది!

చాలతొందరలో పైట జారిపోయి
కడఁగి దింపిన తెరచాప కరణి నుండె
భీతిఁగొను ప్రయాణీకుల రీతిఁ దల్ల
డిల్లి పోయెడు కుచములు పెల్లు కలఁగి

సుదతీ! భయము లేదు. నిలుచుండుము. ఒక్కసారి మాటలాడి పొమ్ము. (నిష్క్రమించును.)

ఉ:—ఆహా! ఈదురాగత మేమి యీయనకు? సైరంధ్రి మహాపతివ్రత యఁట. ఆమె భర్తలు మహాబలవంతులఁట. పగఁ బట్టిన కోడెత్రాఁచుల వలెఁ బ్రాణములఁ దీయుదురఁట.

ద్రౌ:—(ప్రవేశించి) ఇంక నెవ్వరు నాకు సాయపడువారు లేరా? నాభర్తలే నా కీవేళ సాయపడవలయును.

సకలరాజన్యరత్నకిరీటసేవితపాదద్వయా! జయ! పలుక వేమి?
నిఖిలరాక్షసగర్వనిర్భేదచణమహాద్భుతవిక్రమ! జయంత! శ్రుతమ కాదొ
సవ్యదోర్దండప్రచండకోదండ! రావా విజయాభిధాన! యీవేళ మేల
దివిజాళ్యాగమనవర్ధితపరాక్రమశీల! రావా జయత్సేన! రా వోయి నీవు?

పశుసమూహంబు గూడ నీ పరమకరుణఁ
దేల్చెదవు జయద్బల! నన్నుఁ దేల్చ వేమి!
ఘను లధఃకృతశత్రులు గారె మీర
లూరకుండెద రేల? వే రారె! రారె!

(నిష్క్రమించును)

ఊ:—ఓహో! భయంకరముగా నున్నది. ఈ శోక భయంకరమూర్తి నే నెట్లు త్రిప్పఁదును? ఆ గంధర్వులు వచ్చి మా నగరముపైఁ బడరుగద!

కీచ:—(ప్రవేశించి) బేలా! ఏల యూరక నఱచెదవు? ఊధోభారమున నడువలేని యావు వోలె నేల బరువెత్తెదవు? నినొక్కమాట గట్టిగా నడిగిపోయెదను! అంతమాత్రమున కాఁగరాదా!

ఆ గమనరేఖ నన్నెంత యాహరించు!
మారమున కెంత సౌందర్యవారిరాశి
ఆ యెగురుచున్న నీదు చేలాంచలముల
వెలఁది నా ప్రాణములు ముడివేసికొందు.

ఒక్కమాట.

ఉ:—నే నిచ్చటనుండి పిలచిన వారికి నా పిలు పందునటుల లేదు. సమీపించెద.

ద్రౌ:—(ప్రవేశించి)

నా వారల్ జగదేకవిక్రములు గంధర్వాళముల్ నా, రిపు
ప్రాణమ్ముల్ హరియింతు రంచు దనలన్ వ్యాపించె మీ కీర్తు లే
లా నన్నీ గతిఁ జూచుచుండియును జేలల్ వోలె రాకుండిరా
హా! నా కీదృశకష్టముల్ బడిబడి యీజన్మవిస్థంబులే?

ఉ:—(సమీపించి) అమ్మా! సైరంధ్రీ!

ద్రౌ:—తల్లీ! నన్నుఁ బల్కరించకుము.

ఏ నొకమహాపదంభోధి నీదులాడు
చుంటి నా ప్రాణములును నాయొద్ద లేవు
హా! మనోహరులార! నే నలంచి యలంచి
చావవలసినదేన! యీ జనువివలన?

(నిష్క్రమించును)

యాలోచనానిమగ్నునివలె వచ్చుచున్నాఁడు. సంవత్సరము పశువుల గాచుటచేత నీయనలో గొంచెము మార్పు కలిగినది. చూచుటకు దూరమునుండి పశువులకాపరివలెనే యున్నాఁడు.

సు:—అమ్మా! సైరంధ్రి! ఉత్తర ప్రొద్దుటినుండి భోజనము చేయలేదు. నీవు భోజనము చేయలేదని కూర్చున్నది. నీవు తొందరగా లేచి స్నానము చేయుము. పిల్ల భోజనము చేయదఁట. పాలు త్రాగెద నన్నది. పాలు మందనుండి ప్రత్యేకముగాఁ దీసికొనిరమ్మని చెప్పి పంపితిని. అవి వచ్చును. నీవు వానిని దీసికొని స్నానము చేయుము. నేను బాపపరిహారార్థమును, అమంగళనాశముకొఱకును శ్రీ చంద్రమౌళీశ్వరుని బూజ చేయుటకుఁ బోవుచున్నాను.

తంత్రీపాలుఁడు:—(ప్రవేశించి) అమ్మా! ఇదిగో పాలు.

సు:—నీపే రేమి?

తంత్రీ:—తంత్రీపాలుఁడు.

ఉ:—ఓయీ! బోయఁడా! మీయావుల నెద్దులను గంధర్వు లాక్రమించుకొనిరఁట గదా!

తంత్రీ:—గంధర్వు లాక్రమించుకొని యుండ మముఁ దఱిమి వేసిరి. కాని మేమడవులవెంట వెదకి కొన్నింటిని బట్టుకొంటిమి. మంద లెక్కపెట్టుటకుఁ బోయినఁగాని తెలియవచ్చినది. తెల్లవారు వఱకు నంతయు సరిగా నుండును.

ఉ:—నీవు గంధర్వులను జూచినావా?

తంత్రీ:—చూచినాను.

ఉ:—వా రెట్లున్నారు?

